క్లుప్తంగా

పావంచా నిర్మాణం

మామిడికుదురు: పంచాయతీ నిధులు రూ.4 లక్షల వ్యయంతో లూటుకుర్రు పంచాయతీ చెరువు వద్ద పావంచా నిర్మిస్తున్నారు. ఈ పనులను సర్పంచ్ అడబాల తాతకాపు, ఉప సర్పంచ్ కోట బ్రహ్మానందం, వార్డు సభ్యులు బోణం అబ్బులు, గోకవరపు శేషు గురువారం పరిశీలించారు. పావంచా నిర్మాణం పనులు తుది దశకు చేరుకున్నాయన్నారు. పంచాయతీ నిధులతో అభివృద్ధి పనులు చేపడుతున్నామని సర్పంచ్ తెలిపారు. గ్రామంలో ప్రజల నుంచి వచ్చే అభ్యర్థనల మేరకు అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు.

వైఎస్సార్ సీపీ నేత మృతి


గోగు శరత్‌కుమార్ (ఫైల్)

మామిడికుదురు: పెదపట్నం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు గోగు శరత్‌కుమార్ (58) కాకినాడ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందారు. ఆయన సోమవారం సైకిల్‌పై వెళ్తూ పడిపోయి తీవ్రంగా గాయపడ్డారు. శరత్‌కుమార్‌ను కాకినాడ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆయన అంత్యక్రియలు గురువారం స్వగ్రామంలో నిర్వహించారు. పార్టీ ఆవిర్భావం నుంచి వైఎస్సార్ సీపీలో ఉంటూ సీనియర్ నాయకుడిగా గుర్తింపు పొందారు. ఆయన మృతి పట్ల పి.గన్నవరం నియోజకవర్గం కో–ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు, పార్టీ మండల, జిల్లా, స్థానిక నేతలు సంతాపం తెలిపారు.

నేడు గ్రామ కమిటీల సమావేశం

మలికిపురం: రాజోలు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ గ్రామ శాఖ కమిటీల సమావేశం శుక్రవారం ఉదయం మలికిపురం పార్టీ కార్యాలయంలో జరుగుతుందని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు అందరూ హాజరుకావాలని ఆయన కోరారు.

నిత్యాన్నదానానికి విరాళం

అయినవిల్లి: మండలంలో ప్రసిద్ధగాంచిన విఘ్నేశ్వరస్వామి ఆలయంలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన పథకానికి ముమ్మిడివరం గ్రామానికి చెందిన గ్రంధి వెంకట నాగ గుప్తా, రత్నమాల దంపతులు గురువారం రూ.10,116లు విరాళంగా అందజేశారు. ఈ సొమ్మును ఆలయ అర్చకులు అయినవిల్లి సత్తిబాబుకు దాత అందజేశారు. దాతను వేదమంత్రాలతో సత్కరించి స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

నేడు 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ'

అంబాజీపేట: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు బాబు ష్యూరిటీ– మోసం గ్యారంటీ రచ్చబండ కార్యక్రమాన్ని పుల్లేటికుర్రు 1, 2 సచివాలయాలు, మొసలపల్లి, కె.పెదపూడి గ్రామాల్లో శుక్రవారం నిర్వహించనున్నట్లు పార్టీ మండల శాఖ అధ్యక్షుడు విత్తనాల ఇంద్రశేఖర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా పాల్గొనున్నారన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పార్టీ అనుభంద విభాగాల నాయకులు పాల్గొనున్నట్లు తెలిపారు.

ఎస్‌టీయూ మండల అధ్యక్షుడిగా సలాది


సలాదిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఆలమూరు: మండల ఎస్‌టీయూ అధ్యక్షుడిగా సలాది శ్రీనివాసు నియమితులయ్యారు. మండలంలోని చొప్పెల్ల ప్రాథమిక పాఠశాలలో గురువారం నిర్వహించిన సమావేశంలో మండల శాఖను సహచర సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సలాది, ప్రధాన కార్యదర్శిగా దుర్గాప్రసాద్, మహిళాధ్యక్షురాలు శ్రావణి, సబ్ కమిటీ కన్వీనర్ రాజగోపాల్, ఆర్థిక కార్యదర్శిగా దాసుతో పాటు కార్యవర్గ సభ్యులుగా పలువురిని ఎన్నుకున్నారు. ఇప్పటి వరకు పనిచేసిన వంశీకృష్ణ బదిలీపై వెళ్లిపోవడంతో ఎన్నిక అనివార్యమైంది. దీంతో మండలంలోని జొన్నాడ జడ్పీ హైస్కూల్‌లో పనిచేస్తున్న సలాదిని సహచర సభ్యులు ఎన్నుకుని ఘనంగా సత్కరించారు.

ఉద్యోగులకు సన్మానం

అంబాజీపేట: గంగలకుర్రు అగ్రహారం సచివాలయంలో విధులు నిర్వహిస్తూ బదిలీపై ఇతర ప్రాంతాలకు వెళ్లిన 8 మంది సచివాలయ ఉద్యోగులను సర్పంచ్ దొంగ నాగేశ్వరరావు అధ్యక్షతన ఘనంగా సత్కరించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ, సేవలందించే ఏ అధికారైనా ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతారన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మౌనిక తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి ట్యాంకులు ప్రారంభం

సఖినేటిపల్లి: మండలంలో కేశవదాసుపాలెం, శృంగవరప్పాడు గ్రామాల్లో రూ.41లక్షలతో, మోరిపోడులో రూ.54 లక్షలతో నిర్మించిన మంచినీటి ట్యాంకులు, సీసీ రోడ్లును ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ ప్రారంభించారు.

అధికం.. అనర్థం!

- రసాయనిక మందుల పిచికారీలో జాగ్రత్తలు అవసరం
- పెరిగిన వినియోగం
- ఎక్కువ వినియోగిస్తే తీవ్ర నష్టం


మొసలపల్లిలో పంటకు పిచికారీ చేస్తున్న రైతులు (ఫైల్)

అంబాజీపేట: ఆధునిక టెక్నాలజీ పెరుగుతున్నా.. వ్యవసాయం మాత్రం వ్యయసాయంగా మారింది. రైతులు సరికొత్త పద్ధతుల్లో పంటల సాగు చేయడంతో రసాయనిక పురుగు మందుల వినియోగం కూడా రోజురోజుకూ పెరిగిపోతోంది. విత్తనాలు చల్లడం నుంచి పంట కోతకు వచ్చే వరకు పురుగు మందుల వాడకంపై రైతులు తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలి. లేని పక్షంలో పంట దిగుబడి దెబ్బతినడంతోపాటు రైతు నష్టాల బారిన పడాల్సి వస్తుంది. అధికంగా పురుగు మందులు వినియోగిస్తే ప్రమాదమని వ్యవసాయ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. మోతాదుకు మించి రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులు వినియోగిస్తే పంటపై ప్రభావం పడుతుందని, తప్పకుండా వ్యవసాయ సిబ్బంది సలహాలు, సూచనలు పాటించాలని చెబుతున్నారు. 25 డిగ్రీల ఉష్ణోగ్రత ఉన్న సమయంలో పంటలకు పిచికారీ చేయాలి. రైతులు పలు జాగ్రత్తలు తీసుకొని పిచికారీ చేస్తే ప్రమాదాల నుంచి గట్టెక్కవచ్చని ఇటు వైద్యులు, అటు వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

నియోజకవర్గాలు	ఎకరాల్లో వరి సాగు
పి.గన్నవరం	25,382
కొత్తపేట	34,702
రాజోలు	8,650

పిచికారీ చేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు

గాలికి ఎదురుగా రసాయన మందులు పిచికారీ చేయకూడదు. తెగుల మందు, పురుగుమందు కలిపి పిచికారీ చేయరాదు. చేతులకు గ్లౌజులు, నోరు, ముక్కుకి మాస్కులు వేసుకోవాలి. మందులు పిచికారీ చేసే సమయంలో కళ్లు, ముక్కు, నోరు, చేతులతో రుద్దుకోకూడదు. వాడిన పురుగు మందుల డబ్బాలు ఎక్కడపడితే అక్కడ వేయకూడదు. రసాయన మందుల పిచికారీ సమయంలో స్ప్రేయర్లకు లీకేజీ లేకుండా చూసుకోవాలి. ద్రావణం కలిపే మందు డబ్బాపై సూచించిన విధంగా, వ్యవసాయ అధికారులు సూచించినట్లు గానీ పిచికారీ చేయాలి. పిచికారీ చేసే సమయంలో బీడీలు, సిగరెట్లు తాగరాదు. భోజనానికి ముందు చేతులు సబ్బుతో శుభ్రం చేసుకోవాలి. రసాయన మందు పిచికారీ చేసే సమయంలో కడుపుమంట, దద్దుర్లు వస్తే సమీపంలో ఉన్న వైద్యుడిని సంప్రదించాలి.

మోతాదుకు మించి వాడకూడదు



వ్యవసాయ సిబ్బంది సూచించిన మేరకు తగిన మోతాదులో పంటకు ఉదయం వేళల్లో పిచికారీ చేయాలి. ముఖానికి మాస్కులు, చేతులకు గ్లౌజులు, కళ్లకు అద్దాలు ధరించి పిచికారీ చేయాలి. కలుపుమందు కొట్టిన తరువాత పురుగు మందు కొట్టకూడదు. మొక్కల పై భాగంతోపాటు కిందభాగం తడిసిపోయేలా పిచికారీ చేస్తే ఆకు కింద ఉన్న రసం పీల్చే పురుగులు నశిస్తాయి.

– కె.ధర్మప్రసాద్, మండల వ్యవసాయాధికారి, అంబాజీపేట.

దోమల నివారణతో డెంగీ దూరం


దోమల నివారణపై అవగాహన ర్యాలీ

రాజోలు: దోమల నివారణతో డెంగీ, మలేరియాలను దూరం చేయవచ్చని తాటిపాక పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సీహెచ్ ఫణికిరణ్ అన్నారు. గురువారం రాజోలు గాంధీ బొమ్మ సెంటర్ నుంచి తహసీల్దారు కార్యాలయం వరకు తాటిపాక, రాజోలు కో–లోకేటెడ్ పీహెచ్‌సీల ఆధ్వర్యంలో ఆరోగ్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. స్థానిక మార్కెట్ సెంటర్ వద్ద మానవహారంగా ఏర్పడి దోమల నివారించాలని ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఫణికిరణ్ మాట్లాడుతూ, గ్రామాల్లో మురుగునీటి కుంటలను గుర్తించి నీటి పారుదలకు ఏర్పాట్లు చేయాలన్నారు. దోమలు వ్యాప్తి చెందకుండా లార్వాలను నాశనం చేయాలన్నారు. డాక్టర్ దివ్యదర్శిని, సబ్ యూనిట్ అధికారి ఆదినారాయణ, ఎంపీహెచ్‌ఈఓ కె.త్రినాథరావు, సీహెచ్‌ఓ ఎలిజబెత్, పీహెచ్‌ఎన్ సత్యవతి, సూపర్‌వైజర్ మద్దాల శ్రీనివాసరావు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కొబ్బరి పంటను కాపాడాలి

మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు


సమావేశంలో మాట్లాడుతున్న గొల్లపల్లి సూర్యారావు

మలికిపురం: సముద్ర తీర గ్రామాల్లో కొబ్బరి పంటను కాపాడాలని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గురువారం మలికిపురంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉప్పునీటి ప్రభావానికి వేలాది ఎకరాల్లో కొబ్బరి తోటలు దెబ్బతిన్నాయన్నారు. దీనికి కారణాలు అన్వేశించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. లేకుంటే భవిష్యత్‌లో ఇక్కడ వలసలు తప్పవన్నారు. నియోజకవర్గంలో రోడ్ల పరిస్థితి కూడా అధ్వాన్నంగా ఉందన్నారు. వెంటనే మరమ్మతులు చేయాలని కోరారు. జూలై నెలలో చింతలపల్లి–లక్కవరం రోడ్డు వేస్తామని అధికార పార్టీ నేతలు చెప్పిన హామీ నెరవేరలేదన్నారు. అలాగే డ్రైన్ సక్రమంగా లేక మురుగునీటి పారుదల దెబ్బతిందన్నారు. నియోజకవర్గ పార్టీ యూత్ విభాగం అధ్యక్షుడు గుర్రం జాషువా మాట్లాడుతూ, గ్రామాల్లో పారిశుధ్యం అస్తవ్యస్తంగా ఉందన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు కూనపరెడ్డి రాంబాబు, చింత రాజబాబు, అడబాల జానకిరామ్, రోకం సందీప్, కొల్లాబత్తుల రాజ్ కాటన్, గొల్లమందల వినయ్ తదితరులు పాల్గొన్నారు.

మోసానికి మారుపేరు చంద్రబాబు

- నియోజకవర్గ కో–ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు
- పలు గ్రామాల్లో 'బాబు ష్యూరిటీ– మోసం గ్యారంటీ'


ఊడిమూడిలో చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరిస్తున్న శ్రీనివాసరావు

పి.గన్నవరం: మోసానికి, నమ్మక ద్రోహానికి చంద్రబాబు నాయుడు మారుపేరు అని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కో–ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు అన్నారు. పార్టీ మండల శాఖ అధ్యక్షుడు యన్నాబత్తుల ఆనంద్ ఆధ్వర్యంలో గురువారం జి.పెదపూడి, ఊడిమూడి, బెల్లంపూడి, యర్రంశెట్టివారిపాలెం గ్రామాల్లో బాబు ష్యూరిటీ– మోసం గ్యారంటీ, రచ్చబండ కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న శ్రీనివాసరావు ఆయా గ్రామ శాఖ అధ్యక్షులు కుసుమ సుబ్బారావు, కోట ఏడుకొండలు, బండి రాంబాబుల పర్యవేక్షణలో ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా చంద్రబాబు చేస్తున్న మోసాన్ని వివరించారు. జగన్‌మోహన్‌రెడ్డి తన పాలనలో కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో కూడా కుల, మత, వర్గ, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలను అందించారని ఆయన వివరించారు. చంద్రబాబు నాయుడు అధికారం కోసం ఎంతకైనా తెగిస్తారని మండిపడ్డారు. అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కావస్తున్నా.. సూపర్ సిక్స్ హామీలను అమలు చేయలేదన్నారు. బాబు పాలనతో విసుగు చెందిన ప్రజలు జగన్‌కు మద్దతు ప్రకటిస్తున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు మాట్లాడుతూ, చంద్రబాబు పాలనలో తమకు ఏ విధమైన లబ్ధి అందట్లేదని వాపోయారు. వచ్చే ఎన్నికల్లో జగన్‌ను గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీదేవి కోరారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా వాణిజ్య విభాగం నాయకుడు మంతెన రవిరాజు, పార్టీ నాయకులు నక్కా వెంకటేశ్వరరావు, సాధనాల రమేష్, పందిరి పూర్ణచంద్రరావు, బండి రమేష్, కొల్లు రాంబాబు, కడలి వెర్రియ్య, రాణి శ్రీధర్, అప్పన వెర్రిబాబు, నేతల శ్రీను, పండు తదితరులు పాల్గొన్నారు.


పాశర్లపూడిలో కూటమి మోసాలు ప్రజలకు వివరిస్తున్న శ్రీనివాసరావు

సంక్షేమ పాలన జగన్‌కే సాధ్యం

మామిడికుదురు: సంక్షేమ పాలన అందించడం వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమవుతుందని ఆ పార్టీ పి.గన్నవరం నియోజకవర్గ కో–ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు అన్నారు. బాబు ష్యూరిటీ– మోసం గ్యారంటీ కార్యక్రమం పాశర్లపూడి గ్రామంలో జరిగింది. పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు చిక్కం బుజ్జిబాబు ఆధ్వర్యంలో గ్రామంలో రచ్చబండ నిర్వహించారు. కేవలం అధికారం కోసమే చంద్రబాబు ఎన్నికల్లో హామీ ఇచ్చారని, వాటిలో ఏ ఒక్క హామీ కూడా సక్రమంగా అమలు చేయలేదని ఆయన మండిపడ్డారు. బూటకపు హామీలతో కూటమి ప్రభుత్వం ప్రజల్ని దారుణంగా మోసం చేసిందన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం అధికారంలోకి వచ్చిన వెంటనే అన్ని హామీలు అమలు చేశారని గుర్తుచేశారు. అందుకే ఆయన పట్ల ప్రజల్లో చెక్కు చెదరని ఆదరణ ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ అంకాడి వీరాంజనేయులు, పార్టీ నేతలు బొరుసు చిట్టిబాబు, వాసంశెట్టి రామకృష్ణ, తోలేటి ఆదినారాయణ, పిల్లి శ్రీను, ఉండ్రాజవరపు చిట్టి, పాలూరి రాంబాబు, యర్రంశెట్టి గణేష్, మొల్లం సువర్ణరాజు, రాజేంద్ర, విజయరాజు, రామకృష్ణ పాల్గొన్నారు.

సాయికృష్ణకు సన్మానం


సాయికృష్ణ దంపతులను సత్కరిస్తున్న ఎంపీపీ, అధికారులు

అంబాజీపేట: విధి నిర్వహణలో కష్టపడి పనిచేసే వారికి ఎప్పుడూ గుర్తింపు ఉంటుందని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి అన్నారు. అంబాజీపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో అటెండర్‌గా విధులు నిర్వహిస్తూ ఉద్యోగ విరమణ పొందిన గుత్తుల సాయికృష్ణ సన్మానసభ ఇన్‌చార్జి ఎంపీడీవో నరసింహం అధ్యక్షతన గురువారం జరిగింది. ఎంపీపీ మాట్లాడుతూ, 42 ఏళ్లుగా అటెండర్‌గా విధులు నిర్వహించిన సాయికృష్ణ అందరిమన్ననలు పొందారన్నారు. అనంతరం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ కె.శ్రీనివాస్, వైస్ ఎంపీపీ నేతల నాగరాజు, మండల ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు ముత్తాబత్తుల ప్రశాంత్, ఎంపీటీసీలు పబ్బినీడి రాంబాబు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నాయకుడికి పరామర్శ


మోరిలో జానశంకరరావును పరామర్శిస్తున్న గొల్లపల్లి

సఖినేటిపల్లి: మోరికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, రాష్ట్ర పార్టీ చేనేత ప్రతినిధి జాన శంకరరావును గురువారం ఆ పార్టీ రాజోలు నియోజకవర్గ ఇన్‌చార్జి గొల్లపల్లి సూర్యారావు పరామర్శించారు. స్వల్ప అనారోగ్యంతో ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న శంకరరావును గొల్లపల్లి కలిసి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట నియోజకవర్గ వీవర్స్ వింగ్ అధ్యక్షుడు శ్రీకాంత్, నాయకులు ఉప్పు సోమరాజు, ఐ.వీరనాగరాజు, గుర్రం జాషువా, అడబాల జానకి రామ్ ఉన్నారు.

అవినీతికి కేరాఫ్ 'కూటమి'

జిల్లా వైఎస్సార్ సీపీ అధికార ప్రతినిధి శ్రీధర్


విలేకరులతో మాట్లాడుతున్న శ్రీధర్

రావులపాలెం: కూటమి పాలనలో నియోజకవర్గ పాలకులు అన్నింటా అవినీతికి పాల్పడుతూ వేదాలు వల్లిస్తున్నారని జిల్లా వైఎస్సార్ సీపీ అధికార ప్రతినిధి కప్పల శ్రీధర్ విమర్శించారు. గురువారం రావులపాలెం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. అవినీతి చక్రవర్తి, సామ్రాట్ ఎవరో ప్రజలు గ్రహించారన్నారు. ఉచిత ఇసుక విధానమని చెప్పి ఒక్కో లారీకి రూ.7 వేలు చొప్పున వసూలు చేస్తున్నారని, కేవలం ఒక్క ఇసుకపై రోజుకు రూ.40 లక్షలు ఆర్జిస్తున్నారని విమర్శించారు. గడచిన ఏడాది కాలంలో ఇసుక పేరుతో దోచేసిన రూ.కోట్ల సొమ్ము వాడపాలెం ప్యాలెస్‌కు చేరుతుంది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. ప్రతీ పోస్టుకు, బదిలీపై రావడానికి ఎంతెంత వసూలు చేస్తున్నారో? కమిషన్లు ఎంత తీసుకుంటున్నారో ఇచ్చిన వారికి, తీసుకున్న వారికి తెలుసన్నారు. మద్యం ఏరులై పారిస్తూ ప్రతి బాటిల్‌కు కమిషన్ తీసుకుంటున్నారని ఆరోపించారు. జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డిని విమర్శించే అర్హత కూటమి నాయకులకు లేదన్నారు. ఆయన మచ్చలేని స్వచ్ఛమైన నాయకుడన్నారు. కోవిడ్ సమయంలో తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా కొత్తపేట ప్రభుత్వాస్పత్రి కోవిడ్ వార్డు, పరీక్షా కేంద్రాల్లోకి వెళ్లి బాధితులను పరామర్శించి, భరోసా కల్పించిన ప్రజా సేవకుడు జగ్గిరెడ్డి అని ఆయన పేర్కొన్నారు. నియోజకవర్గంలో కోవిడ్ పరీక్షా కేంద్రాలు ఏర్పాటుచేసి, కిట్లు పంపిణీ చేసి ప్రజలకు అండగా నిలిచారన్నారు. ప్రతి మండలంలో కలెక్షన్ ఏజెంట్లను నియమించుకొని రాబందుల్లా వాలి డబ్బులు కలెక్ట్ చేసి వాడపాలెం ప్యాలెస్‌కు చేరవేస్తున్నారని ఆరోపించారు. పవిత్ర పుణ్యక్షేత్రమైన వాడపల్లి దేవస్థానాన్ని సైతం అవినీతికి ప్రధాన కేంద్రంగా మలుచుకున్నారని విమర్శించారు. అక్కడ కూడా కమిషన్ ఏజెంట్లను పెట్టుకుని ఆ క్షేత్రాన్ని అవినీతిమయం చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. ఏడాది కూటమి పాలనలో అవినీతి, ప్రజా సంక్షేమ వ్యతిరేకతను గమనించిన ప్రజలు మళ్లీ వైఎస్సార్ సీపీ పాలన కోసం ఎదురుచూస్తున్నారని శ్రీధర్ అన్నారు. ఈ సమావేశంలో మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు బొక్కా కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఫిల్టర్ ప్రాజెక్ట్‌కు జాతీయ స్థాయి గుర్తింపు


ప్రాజెక్ట్ పేటెంట్ సర్టిఫికెట్ అందుకున్న టీచర్ నరసింహారావు

అంబాజీపేట: జాతీయ విద్యాపథక దినోత్సవం -2025 సదస్సులో మరోసారి గుర్తింపు లభించిన కార్బన్ డై ఆక్సైడ్ ఫిల్టర్ ప్రాజెక్ట్ పేటెంట్ పొందేందుకు సహకారం అందించనున్నట్లు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ చెప్పారని తొండవరం హైస్కూల్ హెచ్‌ఎం పీవీ కేశవాచార్యులు తెలిపారు. ఈ మేరకు పాఠశాల సైన్స్ టీచర్ కందాల గణేష్ నరసింహారావుతో కలసి విద్యార్థులు ఉత్తరప్రదేశ్‌లోని నోయిడాలో ఉన్న గలగోటి విశ్వవిద్యాలయంలో గత నెల 28 నుంచి 31 వరకు కేంద్ర విద్యాశాఖ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి విజ్ఞాన శాస్త్ర ప్రాజెక్ట్ ప్రజెంటేషన్, వర్క్‌షాప్ జరిగింది. ఇన్నోవేటివ్ సెల్ ఏఐసీటీయూ ద్వారా జాతీయ స్థాయికి ఎంపికైన 39 ప్రాజెక్టుల్లో తమ హైస్కూల్ నుంచి పాల్గొని ప్రదర్శించిన కార్బన్ డై ఆక్సైడ్ ఫిల్టర్ ప్రాజెక్టుకు మరోసారి జాతీయ స్థాయి గుర్తింపు లభించిందన్నారు. విజయం సాధించిన విద్యార్థులకు ప్రత్యేక ఇన్నోవేషన్ కోటాలో భాగంగా ప్రాధాన్యత ఇస్తారని ఏఐసీటీఈ అసిస్టెంట్ డైరెక్టర్ తెలిపారన్నారు. తమ పాఠశాల జాతీయ స్థాయి సదస్సుకు పాల్గొనడంలో కృషి చేసిన జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్, డీఈఓ సలీంభాషా, డీఎస్‌ఓ, ఎంఈఓలకు హెచ్‌ఎం కృతజ్ఞతలు తెలిపారు.

మండల బీసీ సెల్ అధ్యక్షుడిగా మధు



పి.గన్నవరం: వైఎస్సార్ సీపీ పి.గన్నవరం మండల బీసీ సెల్ అధ్యక్షుడిగా రాజులపాలెం గ్రామానికి చెందిన గుత్తుల మధుసూధనరావు (మధు) నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఆయనకు నియామక ఉత్తర్వులు అందాయి. తన నియామకానికి కృషి చేసిన నియోజకవర్గ కో–ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు, జిల్లా పార్టీ అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు యన్నాబత్తుల ఆనంద్ తదితరులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ పటిష్టతకు నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తం


సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఆలమూరు: వర్షాకాలంలో సంభవించే సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారి డి.సాయికిషోర్ కోరారు. మండలంలోని జొన్నాడ, ఆలమూరు గ్రామాల్లోని ఇటుక బట్టి ప్రాంతాల్లో పర్యటించి కార్మికుల ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఏవిధమైన అనారోగ్యం సంభవించిన సత్వరమే సమీప ఆరోగ్య సిబ్బందిని సంప్రదించాలన్నారు. ఇతర ప్రాంతాల నుంచి వలస వచ్చిన కార్మికులు తప్పనిసరిగా మలేరియా, టైఫాయిడ్ తదితర వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఆయా ఇటుక బట్టీల వద్ద అనారోగ్య లక్షణాలున్న చిన్నారులు, రోగులకు ప్రాథమిక చికిత్సను సాయికిషోర్ అందజేశారు. మలేరియా యూనిట్ అధికారి వెంకటేశ్వరరావు, సీహెచ్‌ఓ ఎంఎస్ఎన్ రెడ్డి, హెచ్‌ఈఓ ఏవీవీ రాజా, సూపర్‌వైజర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

డెంగీ మాసోత్సవ ముగింపు ర్యాలీ


డెంగీ ముగింపు ర్యాలీలో పాల్గొన్న డీఎంఓ

కొత్తపేట: నివాస ప్రాంతాలు, పరిసరాల్లో పరిశుభ్రత పాటిస్తూ, నీరు నిల్వ లేకుండా ప్రజల్లో అవగాహన కల్పించడం ద్వారా సమాజ భాగస్వామ్యంతో డెంగీ వ్యాధిని నివారించవచ్చని జిల్లా మలేరియా అధికారి (డీఎంఓ) నక్కా వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. ఈనెల 1 నుంచి 31 వరకూ నిర్వహించిన డెంగీ వ్యతిరేక మాసోత్సవాలను గురువారం ముగించారు. కొత్తపేటలో వైద్యారోగ్య శాఖ కొత్తపేట సబ్ యూనిట్ అధికారి రాజబాబు పర్యవేక్షణలో అవిడి, వానపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఆధ్వర్యంలో అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. డీఎంఓ మాట్లాడుతూ, డెంగీని సమాజం నుంచి వెళ్లగొట్టేందుకు ప్రతి ఒక్కరూ ఆ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో ప్రభలే వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. దోమకాటుకు గురి కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, అందుకు ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మురుగునీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని సూచించారు. దోమలు వృద్ధి చెందకుండా ఫ్రైడే డ్రైడే పాటించాలని సూచించారు. కాచి చల్లార్చిన నీటినే తాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రావులపాలెం సబ్ యూనిట్ అధికారి వెంకటేశ్వరరావు, పీహెచ్‌సీల వైద్యాధికారులు, హెల్త్ అసిస్టెంట్స్, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు ఘన సత్కారం


ఉద్యోగులను సత్కరించిన సర్పంచ్ తదితరులు

కొత్తపేట: మండలంలోని ఖండ్రిగ సచివాలయంలో పనిచేసి వివిధ ప్రాంతాలకు బదిలీ అయిన ఉద్యోగుల వీడ్కోలు కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ దూనబోయిన నవదీప అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పలువురు వక్తలు మాట్లాడారు. గ్రామాభివృద్ధే లక్ష్యంగా పనిచేసిన ఉద్యోగులకు ఎప్పుడూ గౌరవం ఉంటుందన్నారు. కొత్తగా వచ్చిన ఉద్యోగులు కూడా చిత్తశుద్ధితో పనిచేసి గ్రామస్తుల అభిమానం చూరగొనాలని కోరారు. అనంతరం బదిలీ అయిన డిజిటల్ అసిస్టెంట్ లోకేష్, ఏహెచ్‌ఏ రాజేష్, వీఏఏ సూర్యకళ, ఈఏఎస్ వై.భార్గవి, ఏఎన్‌ఎం పద్మజ, మహిళా సంరక్షణాధికారి సులోచన, సర్వేయర్ సీహెచ్ వినయ్‌ను సర్పంచ్, వీడీసీ కన్వీనర్ దూనబోయిన శ్రీనివాసరావు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు శాలువాలు, పూలమాలలతో వారిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు పిలాని లక్ష్మీ తులసి, మాజీ సర్పంచ్ పితాని రాంబాబు, గ్రామ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు బొక్కా సత్యానారాయణ, గ్రామ కార్యదర్శి పి.శాంతి పాల్గొన్నారు.

సేవలతోనే ప్రజల్లో గుర్తింపు

అయినవిల్లి: సేవలతోనే ప్రజల్లో తగిన గుర్తింపు లభిస్తుందని ముక్తేశ్వరం ఎస్ఎస్‌వీఆర్ కళాశాల పాలకవర్గ ఉపాధ్యక్షుడు మద్దింశెట్టి శ్రీరామచంద్రమూర్తి అన్నారు. ఆ కళాశాలలో ప్రిన్సిపాల్‌గా చేసి పదవీ విరమణ పొందిన శ్రీనివాసరావు, సివిక్స్ అధ్యాపకుడిగా చేసిన బి.సామ్ ఏబెల్‌లకు డీఐఈఓ సోమశేఖర్ అధ్యక్షతన వీడ్కోలు సభ నిర్వహించారు. వక్తలు మాట్లాడుతూ, వీరి చేతిలో అనేక మంది విద్యార్థులు విద్యనభ్యసించి ఉన్నత స్థానాల్లో ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ప్రిన్సిపాల్ ఫణిరాజా తదితరులు పాల్గొన్నారు.

శిక్షణలో స్కిల్ పెంచుకోవాలి

కొత్తపేట: మహిళలు, యువతులు ఉచిత టైలరింగ్ శిక్షణ ద్వారా స్కిల్‌ను పెంపొందించుకోవాలని ఎంపీడీఓ నరేష్‌కుమార్ సూచించారు. స్థానిక పంచాయతీ కార్యలయం వెనుక ఆర్‌ఎస్‌కే భవనంలో రెండున్నర నెలలుగా ఉచిత కుట్టు శిక్షణ ఇస్తున్నారు. రెండు బ్యాచ్‌లుగా వంద మంది మహిళలు, యువతులు ఇక్కడ శిక్షణ పొందుతున్నారు. ట్రైనింగ్ టీఓటీ పావనికుమారి, సాంకేతిక ఆపరేటర్ భవాని శిక్షణ ఇస్తున్నారు. వారు దుస్తులు కుట్టడంలో ఎంతవరకు నేర్చుకున్నారు? టైలరింగ్ శిక్షణ వారి జీవనోపాధికి ఎంతవరకు దోహదపడుతుంది? వంటి వివిధ అంశాలపై ఆయన ఆరా తీశారు. శిక్షణకు వారం రోజులు మాత్రమే సమయం ఉందని, శిక్షణ పూర్తయ్యే నాటికి అందరూ అన్ని రకాల మెళుకువలు తెలుసుకోవాలన్నారు.